సాక్షి
తిరుపతి
ఆదివారం । 1 । జూన్ । 2025



ట్రాన్స్‌కో పనుల అడ్డగింత
చిన్నమాంబట్టు వద్ద ట్రాన్స్‌కో పనులను స్థానికులు అడ్డుకున్నారు. ఒక చోట చెప్పి మరోచోట పనులు మొదలెట్టారని ఆరోపించారు. - 8లో



అప్పడే మొదలెట్టేశారా?
మేర్లపాక టోల్‌ప్లాజా సిబ్బంది ఓవరాక్షన్ అప్పడే మొదలైంది. శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్సును ఆపి హంగామా సృష్టించారు. - 8లో



పింఛన్లు.. వీధుల్లోనే ఇక్కట్లు
పింఛన్ తీసుకోవాలంటే పండుటాకులు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. అధికారుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. - 8లో

● తిరుపతి కొర్లగుంటకు చెందిన ప్రసన్న లక్ష్మి డ్వాక్రా సభ్యురాలు. భర్త ఆటో డ్రైవర్. ఇద్దరు పిల్లలు. కుటుంబం గడిచేది కష్టంగా ఉండేది. సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన ఏడాదికే కుటుంబ పరిస్థితి మారింది. అమ్మఒడి రూ.14 వేలు, రూ.18,750 చేయూత నాలుగేళ్లు ఖాతాలో జమచేశారు. ఆసరా ద్వారా రూ.75 వేలు రుణమాఫీ చేశారు. సున్నా వడ్డీ అందింది. భర్త ఆటోడ్రైవర్ కావడంతో వాహన మిత్ర రూ.10 వేలు అందాయి. చేదోడు పథకం కింద నాలుగేళ్లు పాటు రూ.40 వేలు అందాయి. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా ఇంటి స్థలం ఇచ్చారు. జగనన్న హయాంలో ప్రసన్న లక్ష్మి దాదాపు రూ.5 లక్షలకు పైగా లబ్ధి పొందారు. కానీ ఇప్పుడు ఒక్కపైసా కూడా అందలేదని ఆవేదన చెందుతోంది.



మోసం చేశారు



చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నమ్మి ఓటు వేశాం. ఆడపడుచులకు నేను ఉన్నా.. బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ అన్నాడు. ఆడబిడ్డ నిధితో కుటుంబ రూపురేఖలు మారుతాయని చెప్పాడు. ఉచిత బస్సు అంటూ మహిళలను నమ్మించాడు. ఉచిత గ్యాస్ అన్నాడు. కేవలం 10 శాతం మందికి కూడా అందించ లేదు. ఇంత దగా చేస్తాడని కలలో కూడా ఊహించ లేదు.

– అనసూయమ్మ, గృహిణి, తిరుపతి

సంక్షేమ పథకాలేవి బాబు



చంద్రబాబు ఎన్నికల సందర్భంలో ఇచ్చిన హామీలు ఒక్కటీ అమలు చేయలేదు. అధికారం చేపట్టి ఏడాది పూర్తి కావస్తున్నా తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు, సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయో అర్థం కాలేదు. పాఠశాలలు ప్రారంభమయ్యాయి. రెండేళ్లకు సంబంధించి తల్లికి వందనం ఇవ్వాలి. ఆడబిడ్డ నిధి కింది నెలకు రూ.1500 చొప్పున గత ఏడాది నుంచి జమచేయాల్సిందే.

–రమణమ్మ, కార్మికురాలు, తిరుపతి రూరల్

కూటమి ఏడాది పాలనలో అమలు కావాల్సిన హామీలు

పథకం	అర్హులైన మహిళలు	అందాల్సిన మొత్తం(రూ.కోట్లలో)
ఆడబిడ్డ నిధి	10,23,177	1841.71
ఉచిత బస్సు ప్రయాణం	9,29,564	3244.44
తల్లికి వందనం	5,85,264	877.89
నిరుద్యోగభృతి	4,87,576	175.52

ఆడబిడ్డకు వెన్నుపోటు

ఎన్నికల సందర్భంగా చంద్రబాబు అలవిగాని హామీలు గుప్పించారు. అధికారం చేపట్టిన వెంటనే మహిళాభ్యున్నతికి పెద్దపీట వేస్తామంటూ ఊదరగొట్టారు. ఉచిత బస్సు, డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాలు రూ.3 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచుతామంటూ జబ్బలు చరిచారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తామంటూ ప్రలోభపెట్టారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఉద్యోగాలు చేసే మహిళలకు హాస్టల్ వసతి, విద్యార్థినులకు 'కలలకు రెక్కలు' పథకం ద్వారా రుణాలంటూ రెచ్చగొట్టారు. పండుగ కానుకలు, పెళ్లి కానుకలంటూ ఊరించి ఉసూరుమనిపించారు. అధికారం చేపట్టి ఏడాది గడుస్తు న్నా ఇంతవరకు ఏ ఒక్క పథకాన్నీ అమ లు చేయక నట్టేట ముంచేశారని మహిళలు ఆవేదన చెందుతున్నారు.

మహిళలను వంచించి ముంచేసిన చంద్రబాబు



- ఏడాది గడుస్తున్నా ఊసేలేని సంక్షేమ పథకాలు
- జగనన్న పాలనలో మహిళలకు పెద్దపీట
- బాబును నమ్మి మోసపోయామంటున్న మహిళలు

గ్రౌండ్ రిపోర్ట్

తిరుపతి సిటీ:ఎన్నికల సమయంలో చంద్రబాబు అండ్ కో 18 ఏళ్లు పైబడిన కుటుంబంలోని ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 అధికారంలోకి వచ్చిన వెంటనే ఆడబిడ్డ నిధి కింద అందిస్తామని ప్రగల్భాలు పలికారు. బాబు షూరిటీ, భవిష్యత్ గ్యారంటీ అంటూ ఊరువాడా ఊదరగొట్టారు. సూపర్‌సిక్స్ అమలు చేసి తీరుతామని మహిళలను ఆ పార్టీవైపు తిప్పుకున్నారు. నమ్మి ఓటేసిన మహిళలను నిలువునా ముంచేశారు. అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా కనీసం ఒక్క సంక్షేమ పథకం కూడా ఇవ్వకుండా నాన్చుతున్నారు. కడపలో జరిగిన మహానాడు వేదికగానైనా పథకాల అమలుపై ప్రకటన చేస్తారని జిల్లా మహిళలు ఎదురు చూశారు. కానీ ఆ ఊసే లేదు. మళ్లీ చంద్రబాబు మోసం చేశారంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉచిత బస్సు, తల్లికి వందనం పథకాలను ఊరిస్తున్నారు తప్ప అమలు చేసిన పాపాన పోలేదు. జిల్లాలో 9 లక్షల మంది మహిళలకు ఏడాదిగా బాబు సర్కార్ కుచ్చుటోపీ పెట్టింది.

మహిళలను మహరాణులు చేసిన జగనన్న

జిల్లాలోని ప్రతి మహిళా జగనన్న ప్రవేశ పెట్టిన పథకాల ద్వారా లబ్ధిపొందారు. నవరత్నాలు జిల్లాలోని ప్రతి కుటుంబానికీ వలంటీర్ల ద్వారా అందించారు. ప్రధానంగా సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లోని సుమారు 3.36 లక్షల మందికి వడ్డీ రీయింబర్స్‌మెంట్‌తో కోట్ల రూపాయలు లబ్ధి చేకూర్చారు. జిల్లాలోని పేదకాపు సామాజికవర్గానికి చెందిన మహిళలకు ఏడాదికి రూ.15వేల చొప్పున నాలుగేళ్లపాటు 1.21లక్షల మందికి రూ.726 కోట్లు జమచేశారు. ఈబీసీ నేత్తం కింద రూ.15 వేలు చొప్పున నాలుగేళ్లపాటు అందించారు. చిరువ్యాపారులకు లక్ష మందికి రూ.391 కోట్లు రుణ సహాయం చేశారు. బడుగు, బలహీన మహిళలకు 1.21లక్షల మందికి ఏడాదికి రూ.18,750 చొప్పున నాలుగేళ్లపాటు అందించి ఆదుకున్నారు.



వైఎస్సార్ ఆసరా రుణమాఫీ చెక్కును అందిస్తున్న అప్పటి ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష

జగనన్న చేదోడు పథకం కింద ఏడాదికి రూ.10వేల చొప్పున అందించారు. జిల్లాలో 2.57లక్షల పేద మహిళలకు 2 సెంట్లు చొప్పున ఇంటి స్థలం మంజూరు చేసి ఇళ్ల నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పేరుతో అర్హులైన ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూర్చారు. ఏడాదికి రూ.14 వేలు పిల్లల చదువుల కోసం అమ్మఒడి కింద మహిళల ఖాతాల్లో జమచేశారు. వసతి దీవెన, విద్యా దీవెన సైతం తల్లిఖాతాలలో జమచేసి పేద మహిళల గుండెల్లో దేవుడుగా వెలుగొందారు.



వెంకటగిరిలో వైఎస్సార్ సున్నా వడ్డీ చెక్కును అందజేస్తున్న సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

జగనన్న పాలనలో మహిళలకు ఆర్థిక భరోసా ఇచ్చిన పథకాలు

పథకం	లబ్ధి పొందిన మహిళలు	మొత్తం (కోట్లలో)
వైఎస్సార్ ఆసరా	3,32,276	4722.76
వైఎస్సార్ సున్నా వడ్డీ(ఎస్‌హెచ్‌జీ)	3,36,998	304.51
వైఎస్సార్ కాపు నేస్తం	1,21,085	726.51
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	3,02,577	18154.62
జగనన్న తోడు	97,751	391.04
వైఎస్సార్ చేయూత	1,51,750	1138.12
జగనన్న చేదోడు	2,35,076	940.30
నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకం కింద	2,57,664	6441.60
వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా	1,00,121	951.14
అమ్మఒడి	2,57,556	1799.78

కల్యాణ మస్తు ఆదుకుంది



జగనన్న పాలనలో కల్యాణ మస్తు పథకం ద్వారా మా అమ్మాయి వివాహానికి రూ.1,20,000 అకౌంట్‌లో వేశారు. దీంతో పాటు డ్వాక్రా రుణమాఫీ చేశారు. ఆరోగ్యశ్రీ కార్డుతో పాటు చేయూత పథకం సైతం అందించారు. ఇప్పుడు పరిస్థితి దారుణంగా ఉంది. ఉచిత బస్సు అన్నారు. ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికీ నెలకు రూ.1,500 ఇస్తామని చంద్రబాబు చెప్పారు. ఒక్క రూపాయి అందలేదు. – సుజాత, చిల్లకూరు, గూడూరు

జగనన్నకు రుణపడి ఉంటాం



సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత మా బతుకులు బంగారు మయమయ్యాయి. ఎన్నికల్లో ఇవ్వని హామీలను కూడా అమలు చేసి మాలాంటి వారికి చేదోడు వాదోడుగా నిలిచారు. వలంటీర్ మా ఇంటికి వచ్చి వైఎస్సార్ చేయూతకు దరఖాస్తు చేశారు. అప్పటి నుంచి మూడు విడతలుగా ఒక్కో విడతలో రూ.18,750 చొప్పున అందించారు. ప్రతి నెలా వితంతు పింఛన్ కింద నెలకు రూ.3 వేలు వచ్చేది. ప్రస్తుతం పైసా కూడా రాలేదు.

–షేక్ నూర్జహాన్, ఊటుకూరు, సైదాపురం

నయవంచన బాబుకు వెన్నతో పెట్టిన విద్య

- ఏడాది పాలనలో ఒక్క హామీ అమలు చేయని కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారు
- కూటమి అరాచకాలు, అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు
- 4న వెన్నుపోటు దినంగా నామకరణం
- నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం
- పోస్టర్ ఆవిష్కరణలో భూమన కరుణాకరరెడ్డి



వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భూమన కరుణాకరరెడ్డి, సమన్వయకర్త అభినయ్, మేయర్ శిరీష

తిరుపతి మంగళం : వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబు అని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ధ్వజమెత్తారు. తిరుపతి పద్మావతిపురంలోని తన నివాసం వద్ద శనివారం పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీషతో కలిసి జూన్ 4వ తేదీ నిర్వహించనున్న వెన్నుపోటు దినానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం భూమన మాట్లాడుతూ ఎలాగైనా అధికారంలోకి రావాలన్న దురుద్దేశంతో ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ ప్రజలను నమ్మించి, అబద్ధపు హామీలిచ్చి వంచించడం చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్య అన్నారు. గత ఎన్నికల్లో కూడా చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ నోటికొచ్చిన అబద్ధాలు చెప్పి సూపర్‌సిక్స్ హామీలు అంటూ ఏడాది అవుతున్నా ఏ ఒక్క హామీని నెరవేర్చని ప్రజాద్రోహులన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలే టార్గెట్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేసుకుని వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ జైళ్లకు పంపడమే పనిగా పెట్టుకున్నారని భూమన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది పాలనలో సుమారు 800 మందికిపైగా తమ నాయకులపై దాడులు చేశారని, అందులో 370 మందికి పైగా చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కూటమి అరాచకాలు, అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ పాలనపై ఇప్పటికే ప్రజలంతా ఆగ్రహంతో ఉన్నారని, వారే తగిన బుద్ధి చెబుతారని తెలిపారు.

రాష్ట్రానికే ఆదర్శం కావాలి

తిరుపతిలో నిర్వహించే నిరసన కార్యక్రమం రాష్ట్రానికే ఆదర్శంగా ఉండేలా విజయవంతం చేద్దామని భూమన పిలుపునిచ్చారు. పార్టీ నగర అధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి, టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ వాసుయాదవ్, పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గీతాయాదవ్, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి, పార్టీ నాయకులు వెంకటరెడ్డి, సాకం ప్రభాకర్, నల్లాని బాబు, తలారి రాజేంద్ర, కట్టా గోపీయాదవ్, కడపగుంట అమరనాథ్‌రెడ్డి, ఉదయ్‌వంశీ, దినేష్‌రాయల్, షేక్ ఇమ్రాన్‌బాషా, రావూరి ప్రసాద్, చింతా రమేష్, అనిల్‌రెడ్డి, రాజేష్, పసుపులేటి సురేష్, మల్లం రవి, సాయికుమారి, పుణీత, పుష్పలత పాల్గొన్నారు.


వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయండి

చంద్రబాబు రాజకీయ జీవితమంతా దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజలకు వరగబెట్టిందేమీ లేదన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కూటమి ప్రభుత్వం ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చిన జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినంగా నామకరణం చేసినట్టు వెల్లడించారు. జూన్ 4వ తేదీన తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించనున్నట్టు వెల్లడించారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 71,721 మంది స్వామివారిని దర్శించుకోగా 36,011 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.42 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

92.78 శాతం పింఛన్ల పంపిణీ



తిరుపతి ఎస్టీవీ నగర్‌లో పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: జిల్లా వ్యాప్తంగా శనివారం 92.78 శాతం పింఛన్లు పంపిణీ చేసి, రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచినట్టు డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు తెలిపారు. కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తిరుపతిలోని ఎస్టీవీ నగర్‌లో పలువురికి పింఛన్లు పంపిణీ చేసినట్టు వెల్లడించారు.

ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ప్రవేశాలకు దరఖాస్తులు

తిరుపతి కల్చరల్: ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, నాదస్వర పాఠశాలలో 2025–26 విద్యా ఏడాదికి వివిధ కోర్సుల ప్రవేశాలకు జూన్ 2 నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీటీడీ పీఆర్‌వో టి.రవి తెలిపారు. కళాశాలలో గాత్రం, వీణ, వేణువు, వయోలిన్, నాదస్వరం, డోలు, భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు, హరికథ, మృదంగం, ఘటం వంటి విభాగాల్లో ఫుల్‌టైమ్ విశారద(డిప్లొమా) కోర్సులతో పాటు ప్రవీణ(అడ్వాన్స్ డిప్లొమా) కోర్సులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఎస్వీ నాదస్వరం, డోలు పాఠశాలలో ఫుల్‌టైమ్, సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులు ఉన్నాయని తెలిపారు. జూన్ 27 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని, ఇతర ప్రాంతాల విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించనున్నట్టు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు కళాశాల కార్యాలయ పనివేళల్లో ఈవో, టీటీడీ పేరుతో రూ.50 డీడీ తీసి దరఖాస్తు పొందవచ్చని తెలిపారు. రెగ్యులర్ కోర్సులకు 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, సాయంత్రం కోర్సులకు 5వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాల కార్యాలయం పనివేళల్లో సంప్రదించవచ్చని, లేదా 9440793205, 9848374408ను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

ఎస్వీయూలో డీఎస్టీ నిపుణుల బృందం

తిరుపతి సిటీ: భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగానికి చెందిన డీఎస్టీ నిపుణుల బృందం ఎస్వీయూలో శనివారం పర్యటించింది. ప్రాజెక్టులపై సమీక్ష, విద్యా, పరిశోధనల స్థితిగతులపై బృందం వర్సిటీ అధికారులతో సమావేశమైంది. ఈ పర్యటనలో ఎయిమ్స్ రుమటాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఉమాకుమార్, శాస్త్రవేత్త డాక్టర్ ఉమేష్‌కుమార్ శర్మ, డాక్టర్ ఫణి కుమార్ పాల్గొన్నారు. అనంతరం వీసీ చాంబర్‌లో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, జువాలజీ ప్రొఫెసర్ ఎస్.కిషోర్‌తో సమావేశమయ్యారు.



వీసీ, రిజిస్ట్రార్‌తో సమావేశమైన డీఎస్టీ ప్రతినిధి బృందం

దరఖాస్తుల ఆహ్వానం

– నవోదయలో 6వ తరగతిలో ప్రవేశానికి జూలై 29 వరకు గడువు

తిరుపతి ఎడ్యుకేషన్ : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2026–2027 విద్యాసంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆ విద్యాసంస్థ ఆహ్వానిస్తున్నట్లు తిరుపతిలోని విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి జూలై 29వ తేదీ వరకు గడువు ఉందని, డిసెంబర్ 13వ తేదీన జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో అర్హత సాధించిన విద్యార్థులకు ఉచితంగా సీబీఎస్ఈ సిలబస్ విద్యాబోధన, వసతి, భోజనం కల్పిస్తారని తెలిపారు. ఈ ఏడాది 5వ తరగతి చదివే విద్యార్థులు అర్హులని, మరిన్ని వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

నిండలిలో పిచ్చికుక్క స్వైర విహారం



గాయపడిన వ్యక్తి

బాలాయపల్లి(సైదాపురం): వీధుల్లో నడుచుకుంటూ వెళ్తున్న ఇద్దరి వ్యక్తులపై పిచ్చికుక్క దాడి చేసిన ఘటన బాలయపల్లి మండలం, నిండలి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. నిండలి గ్రామానికి చెందిన తిరుమలశెట్టి నాగమణి, అల్లం లూథర్ గ్రామంలో నడుచుకుంటూ వెళ్తున్నారు. అటుగా వచ్చిన పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. ఇద్దరిపై విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచింది. ఈ మేరకు బాధితులు చికిత్స నిమిత్తం బాలాయపల్లి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లగా.. అక్కడ కుక్కకాటుకు మందులు లేవని వైద్యులు చెప్పడంతో అవాక్కయ్యారు. అనంతరం నెల్లూరుకు తరలివెళ్లారు.

పింఛన్లు.. వీధుల్లోనే ఇక్కట్లు



ఎక్కడున్నారయ్యా..!

కూటమి ప్రభుత్వంలో పింఛన్ లబ్ధిదారుల పరిస్థితి అయోమయంగా మారుతోంది. గత ప్రభుత్వంలో ఇంటి ముంగిటకే వచ్చి పింఛన్ ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో పండుటాకులు పడరానిపాట్లు పడాల్సి వస్తోంది. అధికారుల కోసం పడిగాపులు కాయాల్సి పరిస్థితి ఎదురవుతోంది. దీనికి తోడు వారు చెప్పిన చోటుకు వెళ్లి పెన్షన్ తెచ్చుకోలేక పలువురు అగచాట్లు పడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఇలాంటిదే తిరుపతిలో శనివారం అడుగడుగునా కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



తిరుపతిలో పింఛన్ల పరిస్థితి ఇదీ..!

నిందితుడిపై పోక్సో కేసు

రేణిగుంట: దళిత బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన ఘటనలో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం.. రేణిగుంట మండలం, కరకంబాడిలో దళిత బాలికపై అదే గ్రామానికి చెందిన ప్రసన్నకుమార్ అత్యాచార యత్నానికి ఒడిగట్టాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సోతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ పీ.శ్రీనివాసరావు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో చొరవ చూపిన సీఐ జయచంద్ర, ఎస్ఐ అరుణ్ కుమార్‌రెడ్డి, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ట్రాన్స్‌కో పనుల అడ్డగింత



ట్రాన్స్ కో అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

తడ: ఏపీఐఐసీ పారిశ్రామిక వాడలోని పరిశ్రమల అవసరాలకు మాంబట్టు సెజ్ పరిధిలో చిన్న మాంబట్టు దళితవాడకు ఎగువన ఏపీ ట్రాన్స్‌కో ఏర్పాటు చేసే 130–కేవీ సబ్ సస్టేషన్ పనులను శనివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా పనులు చేయడం భావ్యం కాదన్నారు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులకు తెలపకుండా చదును చేసే ప్రయత్నం మానుకోవాలని కోరారు. పారిశ్రామిక అవసరాల కోసం ఏర్పాటు చేసే సబ్ స్టేషన్ కోసం గ్రామ అవసరాలకు పనికి వచ్చే స్థలాన్ని ఎంపిక చేయడం ఏమిటని నిలదీశారు. గత ప్రభుత్వంలో సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం వేరొక ప్రాంతాన్ని ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. కానీ ఇప్పుడు గ్రామావసరాలకు పనికొచ్చే స్థలంలో సబ్‌స్టేషన్ నిర్మిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ట్రాన్స్‌కో డీఈ బలరామ్మూర్తి స్పందిస్తూ ఏవైనా అభ్యంతరాలుంటే రెవెన్యూ అధికారులకు తెలపాలని సూచించారు. ఎస్ఐ కొండపనాయుడు ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. అభ్యంతరాలను సోమ వారం రెవెన్యూ అధికారులకు తెలిపి అక్కడి నుంచి వేరొక చోటుకు మార్పు చేసుకోవాలని చెప్పారు. సర్పంచ్ రమణయ్య, ఎంపీటీసీ శ్రీపతిబాబు, ట్రాన్స్‌కో ఏఈ ప్రవీణ్, ఏడీఈ సురేష్, తడ ఏఈ మురళి ఉన్నారు.

‘బార్’లా తెరిచేశారు!



మద్యం దుకాణం వద్ద అనధికారికంగా ఏర్పాటు చేసిన మినీ బార్

నాగలాపురం: నాగలాపురం మండలంలో అనధికార బార్లను తలపించేలా పర్మిట్ రూమ్‌లు నడుస్తున్నాయి. నాగలాపురం మండల కేంద్రంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్యం దుకాణం వద్ద నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్ రూములు కొనసాగుతున్నా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పోలీస్ అవుట్ పోస్ట్‌కు కూటమి బ్యానర్లు





పోలీస్ అవుట్ పోస్ట్ కనిపించకుండా వెలిసిన బ్యానర్లు

రేణిగుంట: రేణిగుంట మండలంలో తిరుపతి, చెన్నై, నెల్లూరు రహదారులు కలిసే ప్రధాన కూడలిలో ట్రాఫిక్ నియంత్రణ, నిత్య పర్యవేక్షణకు పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ అవుట్ పోస్ట్ మూడు వైపులా అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకులు బ్యానర్లు కట్టేశారు. దీంతో అవుట్ పోస్ట్ నిరుపయోగంగా మారింది. నిత్యం అనేక మంది ప్రముఖులు విమానాశ్రయం నుంచి ఇదే మార్గాన తిరుమలకి వెళ్లి వస్తుంటారు. అలాంటి ముఖ్యమైన మార్గంలో అవుట్ పోస్ట్‌ను నిరుపయోగంగా ఉంచడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



అర్జున్ (ఫైల్)

నాగలాపురం: లారీ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని బైటకొడియంబేడు గ్రామంలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. బైటకొడియంబేడు దళితవాడకు చెందిన అర్జున (49) కూలిపని చేసుకుని జీవనం సాగించేవాడు. శనివారం ఉదయం తన సొంత పనుల నిమిత్తం ఇంటి వద్ద నుంచి నందనం గ్రామానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరి తిరుగి ఇంటికి వస్తున్నాడు. అదే సమయంలో చెన్నై నుంచి తిరుపతి వైపు వెళ్తున్న ఓ కంటైనరు లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో అర్జున్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని ఓ ప్రయివేటు వాహనంలో నాగలాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్జున్ మృతిచెందాడు. అర్జున్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతిచెందడంతో బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించడం చూపరులను కలచివేసింది.

బీపీఈడీ రీవాల్యుయేషన్‌కు 12న ఆఖరు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో ఫిబ్రవరిలో జరిగిన బీపీఈడీ తొలి సెమిస్టర్ పరీక్షల ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు అభ్యర్థులు ఈనెల 12లోపు దరఖాస్తు చేసుకోవాలని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ బీ.రాజమాణిక్యం తెలిపారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన సూచించారు.

బ్యాంక్‌లోనే బ్యాగ్ కొట్టేద్దామని!



స్టేషన్ వద్ద గుమికూడిన జనం

- చోరీకి యత్నించిన మహిళా దొంగ



మహిళా దొంగను పట్టుకొస్తున్న పోలీసులు

సైదాపురం: సైదాపురం పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోని ఓ బ్యాంక్‌కు వచ్చిన మహిళ బ్యాగ్‌ను మహిళా దొంగ కొట్టేసేందుకు యత్నించిన ఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. బాధితురాలి కథనం.. మండలంలోని అనంతమడుగు గ్రామానికి చెందిన బండి శశికళ సైదాపురంలోని సిండికేట్ బ్యాంకులో బంగారు రుణం చెల్లించేందుకు శనివారం స్వగ్రామం నుంచి బ్యాంకుకు చేరింది. శశికళ ఓచర్ రాస్తున్న సమయంలో ఓ మహిళ అనుమానాస్పదంగా కనిపించింది. ఓచర్ రాసి బ్యాగును చూడగా.. బ్లేడుతో కోసిన ఆనవాళ్లు కనిపించాయి. దీంతో అక్కడే ఉన్న ఆ మహిళను ప్రశ్నించగా బ్యాంకులో నుంచి ఉడాయిచింది. స్థానికులు ఆ మహిళను వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. అనంతరం బాధితురాలు రాపూరు సీఐ సత్యనారాయణ, ఎస్ఐ క్రాంతికుమార్‌కు కూడా ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

తిరుపతి అర్బన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. మిషన్ హరితాంధ్రప్రదేశ్ వనం–మనం కార్యక్రమంలో భాగంగా ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఐదు లక్షల మొక్కలు నాటాలన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలోని చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో ఏనుగుల సంచారం ఎక్కువగా ఉందని, అక్కడ నిమ్మ తోటల పెంపకం ఉండేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో అటవీశాఖ అధికారి వివేక్, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, డీపీవో సుశీలాదేవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తిరుపతి క్రైమ్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. అలిపిరి పోలీసుల కథనం.. బీటీఆర్ కాలనీకి చెందిన రవికుమార్(34) శుక్రవారం రాత్రి శెట్టిపల్లి రైల్వే గేట్ వద్ద ద్విచక్ర వాహనం నుంచి కింద పడ్డాడు. ఈ క్రమంలో అతని తలకు బలమైన గాయమైంది. స్థానికులు రుయా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి అన్న వెంకటాద్రి ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

దొంగ అరెస్ట్

- 21 గ్రాముల బంగారు, 480 గ్రాముల వెండి స్వాధీనం



పట్టుబడిన సొత్తును చూపిస్తున్న క్రైమ్ పోలీసులు

తిరుపతి క్రైమ్: నగరంలోని ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఓ దొంగను అరెస్ట్ చేసినట్లు క్రైమ్ పోలీసులు శనివారం తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. గత నెల 4వ తేదీన ఎంఆర్ పల్లి సమీపంలో నివాసముంటున్న పుల్లారెడ్డి సొంత పనుల నిమిత్తం బెంగళూరుకు వెళ్లారు. పనులు ముగించుకొని గత నెల 16వ తేదీన ఇంటికి చేరుకోగా.. ఇంట్లో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంటి తాళాలు పగులగొట్టడంతోపాటు ఇంట్లోకి వెళ్లి చూడగా దొంగలు పడినట్లు ఆనవాళ్లు గుర్తించారు. అదేవిధంగా గత రెండు నెలలుగా చెర్లోపల్లి పద్మావతి నగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా దొంగతనాలు జరిగాయి. వీటిపై క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చిన్నగొట్టిగల్లుకు చెందిన భానుచంద్రాచారి అలియాస్ భాను నగరంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అరెస్ట్ చేసి తమదైన శైలిలో విచారించారు. పై తెలిపిన నాలుగు ప్రాంతాల్లో దొంగతనాలు చేసినట్లు అతను నేరం ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి 21 గ్రాముల బంగారు, 488 గ్రాముల వెండి, రెండు సామ్‌సంగ్ టీవీలను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన రమేష్

తిరుపతి క్రైమ్: తిరుపతిలో నివాసముంటున్న ఓ వ్యక్తి మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. అలిపిరి ఎస్ఐ లోకేష్ తెలిపిన వివరాల మేరకు.. తిరుపతిలోని జీవకోన అరుణోదయనగర్‌లో నివాసముంటున్న రమేష్(43)కు భార్య సుమతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇతను ట్రావెల్స్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై తీవ్రమైన ఒత్తిడితో ఆత్మహత్య చేసుకోవాలని శుక్రవారం రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని తనువు చాలించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

అప్పుడే మొదలెట్టేశారా?

– ఆర్టీసీ బస్సును ఆపేసిన టోల్‌గేట్ సిబ్బంది

ఏర్పేడు: రేణిగుంట–శ్రీకాళహస్తి మార్గం మేర్లపాక సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన నేషనల్ హైవే టోల్‌గేట్ వద్ద శనివారం మధ్యాహ్నం శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్సును టోల్‌గేట్ సిబ్బంది ఆపేశారు. ఆర్టీసీ యాజమాన్యం ఫాస్టాగ్ రీచార్జి చేశారని, అది చూపడం లేదని కండక్టర్ చెప్పినా సిబ్బంది వినిపించుకోలేదు. ప్రయాణికులు సుమారు అర్ధగంట పాటు రోడ్డుపైనే నిరీక్షించాల్సి వచ్చింది. ఎండకు తట్టుకోలేక పలువురు వృద్ధులు బస్సులోనే నీరసించారు. చివరకు సిబ్బంది బస్సును అనుమతించారు.